

గుర్తింపుతోనే.. సరి

అక్రమ కట్టడాలపై చర్యలు శూన్యం

- ప్రకటనల్లోనే కూల్చేస్తామన్న హెచ్చరికలు



● నరసరావుపేటలో నిర్మించిన అపార్ట్‌మెంట్

ప్లాన్లు తీసుకుని కొందరు.. లేకుండా మరికొందరు యథేచ్ఛగా భవన నిర్మాణాలు చేస్తున్నారు. ఇంకొందరు పేరుకు ప్లాన్ తీసుకుని అందుకు పూర్తి విరుద్ధంగా భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు గుర్తిస్తున్నారే కానీ వాటిపై చర్యలు ఉండటంలేదు. మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో కళ్లెదుట అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం ఒకవైపు అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని సూచిస్తున్నా ఎక్కడికక్కడ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. ఒకవిధంగా అక్రమ నిర్మాణాలను అధికారులే ప్రోత్సహిస్తు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపల్ పట్టణాలతో పాటు గుంటూరు నగరపాలక సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా భారీగా భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు తరచూ ప్రభుత్వం అవకాశం ఇస్తున్నా ఫలితం ఉండటం లేదు. అధికారులు, రాజకీయ నాయకుల అండతోనే అక్రమ నిర్మాణదారులు క్రమబద్ధీకరణకు ముందుకు రావడంలేదన్న ఆరోపణలు ఉంటున్నాయి.

గుంటూరులో 10 వేలకు.. 8 దరఖాస్తులు

గుంటూరు నగరంలో కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగు తున్నాయి. నగర పరిధిలో 10 వేలకు పైగా అక్రమ కట్టడాలు ఉండగా ఇటీవల వరకు 8 మంది మాత్రమే బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. జీఎంసీ పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలు కనిపిస్తాయి. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించు కోకపోతే కూల్చేస్తామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా నిర్మాణదారులు అంతగా లెక్క చేయడంలేదు. బీపీఎస్ దరఖాస్తుకు గడువు ముగిసిన వెంటనే అక్రమ భవనాలపై కఠినంగా చర్యలు తీసుకుంటామని, వాటిని కూల్చివేస్తామని జీఎంసీ సీపీ రాంబాబు తెలిపారు.

- పురాల్లో బీపీఎస్ దరఖాస్తులు అరకొరగానే
- అనుమతించిన ప్లాన్లలో నిబంధనల అతిక్రమణ
- మామూళ్లతో కళ్లు మూసుకుంటోన్న మున్సిపల్ అధికారులు

నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, గుంటూరు కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా.. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా.. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగినా నివారించేలా.. భవన నిర్మాణాలు చేపట్టాలి. అందుకు మున్సిపాల్టీ, నగర పాలక సంస్థల నుంచి ముందస్తు అనుమతులు ఉండాలి. నిబంధనల ప్రకా రం ప్లాన్ రూపొందించుకుని, దానికి (మిగతా 8వ పేజీలో)



గుంటూరు బ్రాడీపేట 4/14లో జరిగిన అక్రమ నిర్మాణం



సమావేశం నిర్ణయాలను వివరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

అమరావతి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- రాజధాని రైతులకు రోడ్డు పోటు లేని ప్లాట్లు
- రెండో విడత సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని
- అమరావతి రైతుల సమస్యలపై త్రీమన్ కమిటీ సమీక్ష

తుళ్లూరు, గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతుల సమస్యలను గుర్తించాం.. వాటి పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రాజధాని రైతులతో తాడేపల్లిలోని పెమ్మసాని క్యాంపు కార్యాలయంలో త్రీమన్ కమిటీ రెండో విడత సమావేశం శనివారం జరిగింది. మున్సిపల్ మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను పెమ్మసాని మీడియాకు వివరించారు. రాజధాని అమరావతిలో కొంతమంది రైతులకు గతంలో ఇచ్చిన రోడ్డు పోటు ప్లాట్లకి ప్రత్యామ్నాయంగా వాస్తుదోషం లేని నివేశన స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 156 మంది రైతులు వాస్తుదోషంపై ఫిర్యాదు చేశారని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. మెయిన్ రోడ్డు పెద్దదిగా ఉండి, కనెక్టింగ్ రోడ్డు చిన్నదిగా ఉన్న చోట్ల కమర్షియల్ ప్లాట్లు రోడ్డు పోటు కిందకు రావని అప్పట్లో అధికారులు చెప్పి కేటాయించారన్నారు. వాటికి కూడా ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేస్తున్నామన్నారు. ఎల్‌పీఎస్ స్కీమ్‌లో ఇంకా 2,492 ఎకరాల భూమి సీఆర్‌డీఏకి రావాల్సి ఉండగా 45 మంది రైతులు కోర్టు కేసులు వేశారని, వారితో మాట్లాడి 17 ఉపసంహరింపచేశామన్నారు. మిగతా 28 డిసెంబరు 3న కోర్టు (మిగతా 8వ పేజీలో)

లంక భూముల రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తాం

ఎన్‌జీటీ కేసుతో సంబంధం లేకుండా లంక భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియని ప్రారంభిస్తామని పెమ్మసాని చెప్పారు. అసైన్డ్ భూములపై కేబినెట్‌లో చర్చించి ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఇక నుంచి ప్రతీ రెండు వారాల కు ఒకసారి అమరావతి రైతులతో సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ రైతులు ప్రస్తావిస్తున్న సమస్యలను పరిష్కరించడానికి సీఆర్‌డీఏ అధికారులకు నిర్దేశిత గడువుని విధించి రిపోర్టులు తెప్పించుకుం టున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.



ఫిబ్రవరిలో విజయపురిసౌత్ అటవీ ప్రాంతంలో గుర్తించిన పులులు

రేపటి నుంచి పులుల గణన

నరసరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ ప్రాంతంలో పులులు, ఇతర జంతువుల గణనను అటవీశాఖ సోమవారం నుంచి చేపట్టనుంది. ఈ మేరకు శనివారం కోటప్పకొండలో నిర్వహించిన సమావేశంలో అటవీశాఖాధికారి జి.కృష్ణప్రియ మాట్లాడుతూ జిల్లాలో నాలుగేళ్లకోసారి ఈ గణన నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా డిసెంబరు ఒకటి నుంచి 8వ తేదీ వరకు పులులు, ఇతర జంతువుల గణన జరుగుతుందని చెప్పారు. గతంలో జంతు గణన పుస్తకంలో నమోదు చేయగా.. ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు చెప్పారు. దీనికోసం జిల్లా పరిధిలో గల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్, ముఖ్య అటవీ సంరక్షణ అధికారి, గుంటూరు కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా అటవీ సిబ్బందికి మాచర్ల రేంజ్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చామన్నారు.

జంతు గణన ఇలా సాగుతుంది..

అటవీశాఖాధికారి జి.కృష్ణప్రియ జంతుగణన తీరును వివరించారు. తొలి మూడురోజులు సిబ్బంది నిర్దేశిత ఐదు కిలోమీటర్ల పరిధిలో కాలి నడకన తిరుగుతూ పులుల సంచారానికి సంబంధించిన ఆనవాళ్లను గమనిస్తారని చెప్పారు. తదుపరి రెండు రోజులు సమాచార సంకలనం, చివరి మూడు రోజులు ఎలుగులు, అడవి కుక్కల వంటి జంతువులను గుర్తిస్తారని చెప్పారు. ఆయా జంతువులు నేరుగా కనిపిస్తే ఫొటోలు తీస్తారని, లేదా పెంటికలు, చెట్ల రాపిడి వంటి ఆనవాళ్లను గుర్తిస్తారని వివరించారు. అడవుల్లో సంచరించే పశువుల కాపరులు, అడవుల దగ్గర గ్రామాల్లో నివసించే ప్రజల నుంచి సమాచారం సేకరిస్తారని చెప్పారు. తిరుగు ప్రయాణంలో ఎన్ని వృక్షాలు ఉన్నాయి.. అవి ఏయే రకాలు అని అంచనా వేస్తారని తెలిపారు. ఈ సమాచారాన్ని ప్రధాన అటవీ సంరక్షణాధికారికి పంపనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 1,27,292.64 హెక్టార్లలో అటవి ప్రాంతం ఉందన్నారు. నరసరావు పేట రేంజ్ పరిధిలో 23,105.74 హెక్టార్లలో, పిడుగురాళ్ల రేంజ్‌లో 29,536.73, వినుకొండ 44,673.89, మాచర్ల రేంజ్ పరిధిలో 29,976.28 హెక్టార్లలో అటవీ ప్రాంతం ఉందని వివరించారు. ఈ సమావేశంలో మాధవరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినుకొండ, ఎస్. విజయలక్ష్మి, ఎఫ్ఆర్ఓ మాచర్ల, విజయకుమారి, ఎఫ్ఆర్ఓ పిడుగురాళ్ల, ఎఫ్ఆర్వో వెంకటరమణ పాల్గొన్నారు.



కోటప్పకొండలో జరిగిన సమావేశంలో పాల్గొన్న అటవీ శాఖ సిబ్బంది

పల్లెల్లోనూ.. అన్న క్యాంటీన్లు



నరసరావుపేట: నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్

- మూడు జిల్లాలకు ఐదు మంజూరు
- శరవేగంగా నిర్మాణం.. 300 మందికి ఆహారం

నరసరావుపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో పేదల ఆకలి తీరుస్తూ వివిధ వర్గాల నుంచి ఆదరణ పొందుతున్న అన్న క్యాంటీన్లు ఇక నుంచి పల్లెల్లోనూ సేవలు అందించనున్నాయి. గ్రామీణ ప్రాంతాల పేదల కడుపు నింపేలా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండల, నియోజకవర్గ కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఐదు అన్న క్యాంటీన్లు మంజూరయ్యాయి. వాటి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. నామమాత్రపు ధరకే టిఫిన్, భోజనం అందించేలా 2019కి ముందే గత టీడీపీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే వాటిని వైసీపీ ప్రభుత్వం మూసేసింది. ఈ నిర్ణయం పేదల కడుపు కొట్టడమేనని పలువురు విమర్శించినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను పునరుద్ధరించింది. నిత్యం మూడు పూటలా వందల సంఖ్యలో పేదలు ఇక్కడ ఆహార పదార్థాలతో కడుపు నింపుకుంటున్నారు. పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లకు పెద్దఎత్తున ఆదరణ లభించడంతో పాటు విరాళాలు కూడా వస్తున్నాయి. దీంతో ఇంతకాలం పట్టణ కేంద్రాలకే పరిమితమైన అన్న క్యాంటీన్లను పల్లెలకూ విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీలు ఉండే పల్లెల్లో రూరల్ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుంది. ఈ క్యాంటీన్ల ద్వారా నిత్యం 300 మందికి భోజనం అందించేలా నిర్వహించనున్నారు.

మంజూరు ఇలా..

- పల్నాడు జిల్లా : పెదకూరపాడు
- గుంటూరు జిల్లా : మంగళగిరి, ప్రత్తిపాడు, ఫిరంగిపురం
- బాపట్ల : భట్టిప్రోలు



బాలోత్సవంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, సినీ నటుడు నరేశ్

అట్టహాసంగా బాలోత్సవం

ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమలోని కళా నైపుణ్యాల ప్రదర్శనలకు చిన్నారులు ఉత్సాహంగా తరలిరాగా శనివారం పల్నాడు బాలోత్సవం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడో పిల్లల పండుగకు నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల వేదికగా మారింది. జిల్లావ్యాప్తంగా 200కి పైగా పాఠశాలల నుంచి వందల సంఖ్యలో చిన్నారులు ఈ పోటీలకు తరలివచ్చారు. కోలాటం, బుర్రకథ. శాస్త్రీయనృత్యం తదితర విభాగాల్లో విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. పోటాపోటీగా చిన్నారులు ఆయా విభాగాల్లో ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. విచిత్ర వేషధారణలతో చిన్నారులు ఆహుతులను కట్టిపడేశారు.







బాలోత్సవంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

దళారుల రంగ ప్రవేశం

- ధాన్యం ధర తగ్గింపుతో అన్నదాతలు విలవిల
- వర్షం భయంతో అయినకాడికి అమ్ముకుంటున్న రైతులు

పిడుగురాళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే గత తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో ధాన్యం రైతులు నష్టపోయారు. మళ్లీ తుఫాన్ హెచ్చరికలు జారీ అవుతున్నాయి. దీంతో ధాన్యం రైతులు విలవిలలాడిపోతున్నారు. ఇప్పటికే కోతలు కోసిన ధాన్యం కల్లాల్లో ఉన్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. తేమ శాతం నిబంధనతో రైతులు విక్రయించుకోలేకపోతున్నారు. ఇదే అవకాశంగా దళారులు ఎక్కడికక్కడ రంగ ప్రవేశం చేస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో రైతులు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో పోటీ లేకుండా దళారులు సిండికేటుగా మారి ధరలను తగ్గిస్తున్నారు. రైతుల లోగిళ్లలో ధాన్యాన్ని నిల్వ చేసే పరిస్థితి మునపటిలా లేకపోవడంతో రోడ్ల పక్కన పొలాల్లోనే ధాన్యాన్ని రాశులుగా పోసి ఉన్నారు. వర్షం భయం.. తేమ శాతం నిబంధనతో రైతులు ధాన్యాన్ని విక్రయించకుండా ఉండలేకపోతున్నారు. దీంతో రైతుల రెక్కల కష్టం దళారులు దోచేస్తున్నారు. కొర్రీలు చూపి ధాన్యం ధరను కావాల్సినంత తగ్గించేస్తున్నారు.గత వారం బీపీటీ 75 కేజీల బస్తా రూ.1650, సన్నాల రకం రూ.1350కి దళారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం వాతావరణశాఖ తుఫాన్ హెచ్చరికలతో ఏదో ఒక కొర్రీ వేసి తక్కువ ధరకు బేరాలు సాగిస్తున్నారు. మొంథాతుఫాన్ ప్రభావంతో ఈ ఏడాది ఎకరాకు 5 బస్తాలు తక్కువగా దిగుబడి రావడంతో రైతులు అల్లాడుతున్నారు. ప్రస్తుతం ధర మరింతగా తగ్గించి విక్రయించుకోవాల్సి రావడంపై కలవరం చెందుతున్నారు. ఏ-గ్రేడ్‌కు రూ.1792, కామన్ రకానికి రూ.1777 తగ్గకుండా కొనుగోలు చేసేలా ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నా రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకే దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తే దళారుల దోపిడీ నుంచి తప్పించుకునే అవకాశం ఉంది.



ట్రాక్టర్‌లో గోడౌన్‌కు తరలిస్తున్న ధాన్యం

జైలులో పరిచయం.. ముఠాగా చోరీలు

- ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
- నిందితుల్లో ఇద్దరు చిలకలూరిపేట వాసులు
- రూ.12 లక్షల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జైలులో పరిచయంతో ముఠాగా ఏర్పడిన ముగ్గురు.. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతూ ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌కు చెందిన తుపాకుల వెంకటేష్, కావూరు గ్రామానికి చెందిన బొమ్మల విజయ్, విజయవాడ బాంబే కాలనీకి చెందిన దేవరకొండ రాంబాబులను మేడికొండూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి ఎస్పీ వకుల్ జిందాల్ వివరాలు తెలిపారు. ఈ నెల 3న రాత్రి మేడికొండూరు మండలం పాలడుగు గ్రామంలో ఆమతి వీరయ్య ఇంట్లో 86 గ్రాముల బంగారు, 150 గ్రాముల వెండి ఆభరణాలు, 40 వేల నగదు చోరీ జరిగింది. బాధితుడు ఫిర్యాదు మేరకు మేడికొండూరు సీఐ నాగూర్ మీరాసాహెబ్ సాంకేతిక పరిజ్ఞానంతో 20 రోజుల్లోనే నిందితులను గుర్తించారు. పేరేచర్ల పలకలూరు రోడ్డులో బైకుపై వెళ్తున్న నిందితులను శనివారం అదుపులోకి తీసుకుని విచారించారు. గతంలో అనేక నేరాల్లో వేర్వేరుగా జైలుకు వెళ్లగా ముగ్గురి మధ్య పరిచయమైంది. ఈ క్రమంలో ముగ్గురూ జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ముఠాగా ఏర్పడి నరసరావుపేట పల్నాడు బస్టాండ్ వద్ద ఓ హోటల్‌లో ఉంటూ నేరాలకు పాల్పడ్డారు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రిళ్ల దొంగతనాలు చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

నిందితులపై షీట్లు.. కేసులు

రాంబాబుపై విజయవాడలోని పాయకాపురం పోలీసుస్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉంది. ఇతడిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 150 చోరీ కేసులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వెంకటేష్‌పై చిలకలూరిపేట టౌన్ పోలీసు స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉండగా ఇతడిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో 50కిపైగా కేసులు ఉన్నాయన్నారు. వెంకటేష్ బైక్ దొంగతనాల్లో ఆరితేరాడన్నారు. విజయ్‌పై చిలకలూరిపేట టౌన్ పోలీసుస్టేషన్‌లో రౌడీ షీట్ ఉందన్నారు. ఇతడిపై హత్య, దోపిడీ దొంగతనాలు వంటి కేసులో ఉన్నాయన్నారు. నిందితుల నుంచి 88 గ్రాముల బంగారం, 82 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు ఒక బైకు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసిన డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ నాగూర్ మీరాసాహెబ్, ఎస్ఐ ఖాజీబాబు, హెడ్ కానిస్టేబుల్ ఎండీ సాదిక్, కానిస్టేబుళ్లు జాన్‌సైదా, ప్రవీణ్‌కుమార్, ఎం సురేష్, సిల్వెస్టర్, ఉపేంద్రలను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు ఉపేక్షించేది లేదు

- ప్రతి వరి గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- పౌర సరఫరాలశాఖ మంత్రి మనోహర్

రేపల్లె, చెరుకుపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నష్టం వాటిల్లేలా మిల్లర్లు, వ్యవసాయశాఖాధికారులు వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. శనివారం చెరుకుపల్లి, నడింపల్లి, గూడవల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను ఆయన పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రభుత్వం నిర్ణయించిన రూ.1,792ల మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. మిల్లర్లు, దళారులు కుమ్మక్కై, ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉందని రేట్లు తగ్గిస్తే సహించేది లేదన్నారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాశాఖ అధికారులు రైతులకు ఇబ్బందులు కలిగించినా.. కొనుగోళ్లలో అవకతవకలు జరిగినా.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందన్న మంత్రి.. నడింపల్లి గ్రామంలో ఇలా రైతుల ఖాతాల్లో రూ.17లక్షలు పైనే జమ అయ్యిందని ఉదహరించారు. బాపట్ల జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని.. వ్యవసాయశాఖాధికారుల అంచనాలు 3ల క్షల మెట్రిక్ టన్నులుగా ఉన్నట్లు చెప్పారు. సంక్రాంతి లేదా మార్చి వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మంత్రి మనోహర్ వెల్లడించారు. ఖరీఫ్ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ ఢిల్లీరావు, కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ భావన, ఆర్డీఓ రామలక్ష్మి, ఏడీఏ లక్ష్మి, టీడీపీ నాయకులు అనగానిశివప్రసాద్, తాతా ఏడుకొండలు, గోగినేని వసుధ, మండవ తాతాజీ, ఎంఆర్‌కే మూర్తి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


మునిపల్లె మిల్లులో బియ్యం పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మిల్లర్లు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

పొన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలోని రాయల్ రైతు ఆగ్రోస్ రైస్ మిల్లును శనివారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులోని బియ్యం నిల్వలను పరిశీలించారు. మిల్లింగ్ ఆడుతున్న బియ్యంను పరిశీలించి రేషన్ బియ్యం కాదా అని తనిఖీలు చేశారు. రైస్ మిల్లర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని లేదంటే తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఆఫ్‌లైన్‌లోనూ ధాన్యం కొనుగోలు

కొల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లుగా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ ఎండీ ఢిల్లీరావు, జేసీ భావనతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లర్ల దగ్గర ఉన్న తేమ శాతం పరికరాల్లో ఐదారు శాతం వ్యత్యాసం చూపుతోందని టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడే ఉన్న తేమశాతం పరికరాన్ని నాదెండ్ల పరిశీలించారు. అనంతరం కొల్లూరులోని రైస్‌మిల్లులో తేమ శాతం పరికరాన్ని పరిశీలించి.. వ్యత్యాసం సమస్యగా గుర్తించారు. నిపుణులతో లోపాలను సరి దిద్దుతామని చెప్పారు. ధాన్యం మిల్లులకు చేరవేసేందుకు 55 లారీలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. డిక్లరేషన్ ఇచ్చిన ప్రకారం ప్రతి మిల్లర్ ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు అవసరమైన గోతాలను కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు.

బావిలో యువకుడి మృతదేహం

తాడేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెనుమాక కృష్ణాయపాలెం రోడ్డు వెంబడి పంట పొలాల్లో ఉన్న పాడుబడిన బావిలో యువకుడి మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు శనివారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని బయటకు తీయించి వివరాలు సేకరించినట్లు ఎస్‌ఐ ఖాజావలి తెలపారు. మృతుడు మంగళగిరి పట్టణం కొత్తపేటకు చెందిన పిన్నిక ఆనంద్ (24)గా గుర్తించారు. ఈ నెల 27న ఆనంద్ అదృశ్యమవగా బావిలో విగతజీవిగా కనిపించాడు. మృతుడు ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తాడని, అతని సోదరుడు నరేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కాగా అతని మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుని ఒంటిపై గాయాలున్నట్లు చెబుతున్నారు.


ఆనంద్ (ఫైల్ ఫొటో)

షర్మిలతో పొన్నూరు కాంగ్రెస్ నాయకుల భేటీ

పొన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని శనివారం పొన్నూరు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ చీఫ్ షర్మిళ విజయవాడ రావడంతో పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆమెను కలిసి పొన్నూరులో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై వివరించారు. నియోజకవర్గం కోఆర్డినేటర్ నాగేశ్వరరావు రాజీనామాతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబరు 2వ తేదీన ఏఐసీసీ అబ్జర్వర్, కర్ణాటక రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్య రెడ్డి, అధ్యక్షతన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంఘటన శ్రీ జన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ నాయకులకు షర్మిళ సూచించారు. ఈ కార్యక్రమంలో అందే దిలీప్ తరఫున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


షర్మిలారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పొన్నూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో సుమారు 45 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎల్.వీరానాయక్ కథనం ప్రకారం కసుకర్రు రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు పూరుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఆచూకీ తెలిసినవారు 94407 96172, 9676 262840 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ కోరారు.


మృతదేహం

ఏఎన్‌యూలో ముగిసిన నైపుణ్య శిక్షణ సదస్సు

ఏఎన్‌యూ, నవంబరు 29(ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో నాలుగు రోజుల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. సివిల్ మెకానికల్ బ్లాక్‌లోని టీసీఎస్ ఆన్‌లైన్ సెంటర్‌లో మైక్రోసాఫ్ట్, కౌనిక్ సొల్యూషన్స్ హాండ్స్ ఆన్ పవర్ బీ ఐ వర్క్‌షాప్ జరిగింది. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులు మైక్రోసాఫ్ట్ అందించే స్పాన్సర్ పవర్ బీ ఐ ట్రైనింగ్ ద్వారా స్కిల్స్‌ను మెరుగు పరుచుకోవాలన్నారు. తమ విభాగాల్లో ఈ కోర్సులను అన్వయించుకుని సాధన చేయాలని చెప్పారు. విద్యార్థులు డేటా, బిజినెస్ అనలిస్ట్ తదితర ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశాలున్నాయన్నారు. వర్సిటీ యాజమాన్యం విద్యార్థులకు నైపుణ్యం విషయంలో రాజీ పడదన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శి.లింగరాజు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవా లన్నారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ మాట్లాడుతూ శిక్షణ అందించిన మైక్రోసాఫ్ట్, కౌనిక్ సొల్యూషన్స్. వర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు రిజిస్ట్రార్ సింహాచలం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి. చంద్రమౌళి, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ కె.చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్స్ అందజేస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం

మనసుకు స్వాంతన చేకూర్చే..

ఉత్సవాలు అభినందనీయం

- అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

తెనాలి అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో మనిషికి స్వాంతన చేకూర్చే ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో స్వరలయ వేదిక ఉత్సవాలను శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. వేదిక వ్యవస్థాపకులు సాయి లక్కరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెనాలి ప్రజలకు మంచి సంగీత కార్యక్రమాలను ఈ వేదిక అందిస్తోందన్నారు. కవులు, కళాకారులకు నిలయమైన పట్టణంలో కళా రంగాన్ని ప్రోత్సహిస్తున్న దాతలను అభినందించారు. జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, విజయవాడ దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడు తోటకూర వెంకటరమణరావు, సుబ్రమణ్యేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. వివిధ రంగాల్లో పేరుగాంచిన నిర్మలా రమేష్, కాటూరి వెంకటేశ్వరరావు, ధర్మారావు, దీపాల సత్యనారాయణ, బాబురావు, శాస్త్రి, బ్రహ్మాచార్యులు, రామాంజనేయప్రసాద్, నాగమణి, ప్రభాకర్, పద్మజా ప్రభాకర్, అబ్దుల్ రజాక్, రామకృష్ణను ఘనంగా సన్మానించారు. తెనాలి ఉత్సవ గీతం, కూచిపూడి నృత్య ప్రదర్శన, తెనాలి వైభవం నృత్యం, కోలాట ప్రదర్శనలు అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట బైపాస్ రోడ్డు వల్లపు చెరువు వద్ద ద్విచక్ర వాహనదారుడు ప్రమాదవశాస్తు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్ వివరాల మేరకు.. నరసరావుపేట మండలం రాయపాడు గ్రామానికి చెందిన పెదకొండయ్య(35) శుక్రవారం రాత్రి బైక్‌పై ప్రయాణిస్తూ వల్లప్ప చెరువు వద్ద బైపాస్ రోడ్డు మలుపులో అదుపుతప్పి పడ్డాడు. స్థానికులు నరసరావుపేట వైద్యశాలకు అతనిని తరలించగా శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య అలివేలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా..వ్యక్తి మృతి

రెంటచింతల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రెంటచింతలకు సమీపంలోని గొట్టిముక్కల మేజర్ వద్ద ఆటో బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున వివరాల మేరకు.. గురజాలలో క్యాటరింగ్ పనులు ముగించుకుని రెంటచింతలకు ఆటో వస్తోంది. ఎదురుగా ద్విచక్ర వాహనం రావడంతో దాన్ని తప్పించబోయిన డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో రెంటాల గ్రామానికి చెందిన ఆడెపు మరియదాసు(32) తీవ్రంగా గాయ పడగా.. గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి చెందాడు. మృతుడికి భార్య దుర్గమ్మ, ఇద్దరు సంతానం.మరో ఇద్దరు ప్రమాదంలో గాయపడ్డారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున చెప్పారు.

పిన్నెల్లి సోదరుల పాపం పండింది

- ఎమ్మెల్యేబ్రహ్మానందరెడ్డి



మాచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలను హింసించి హతమార్చి ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసిన వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల పాపం పండిందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అధికారం అడ్డుపెట్టుకొని కన్నుమిన్నూ కానకుండా పేట్రేగిపోయిన అరాచకశక్తి పిన్నెల్లి కుటుంబం అని ఆరోపించారు. సుప్రీంకోర్టు శుక్రవారం పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిందన్నారు. వారికి జైలు శిక్ష తప్పదన్నారు. మాచర్ల ప్రజలు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న న్యాయం దగ్గరలోనే ఉందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల నియోజకవర్గాన్ని రావణకాష్టంగా మార్చేసి తాలిబన్లలా ప్రతిపక్షాలు, ప్రజలపై దారుణ దమనకాండకు తెగబడ్డ దౌర్జన్యకారులు పిన్నెల్లి సోదరులని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహజ వనరులన్నింటిని దోచుకున్నారని, మాఫియాను నడిపించారని, నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం లేకుండా నిర్మూలించాలన్నట్లుగా బరితెగించారని విమర్శించారు. ఎందరో టీడీపీ కార్యకర్తలు దారుణ హత్యకు గురయ్యారన్నారు. జగన్‌రెడ్డి అండతో వ్యవస్థలన్నింటినీ గుప్పిట్లో పెట్టుకొని పెట్రేగిపోయారన్నారు. మాచర్లలో గత ఐదేళ్లలో పిన్నెల్లి రాజ్యాంగం, చట్టమే అమలైందన్నారు. అక్రమ వ్యాపారాలు, భూదందాలు, గనుల అక్రమ తవ్వకాలతో పెద్ద ఎత్తున దోపిడికి పాల్పడ్డారన్నారు. పోలింగ్ కేంద్రంలోకి చొరబడి ఈవీఎంలను ధ్వంసం చేశారన్నారు. సీఐ పైనే హత్యాయత్నం చేసి బరితెగించారన్నారు. వంద గుడ్లు తిన్న రాబందు ఒక్క గాలివానకు నేలకూలిందన్న సామెత పిన్నెల్లికి అతికినట్లు సరిపోతుందన్నారు.

రేపటి నుంచి సూర్యలంకలో క్షిపణి పరీక్షలు

బాపట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం అడవి రెవెన్యూ గ్రామ పరిధిలో సూర్యలంక సముద్రతీరం నందు భారత వైమానిక దళం భూమి ఉపరితలం నుంచి ఆకాశంలోకి గైడెడ్ ఆయుధాల ప్రయోగ శిక్షణ, పరీక్షలు నిర్వహించనుంది. డిసెంబరు ఒకటి నుంచి 5వ తేదీ వరకు ఆయుధ పరీక్షలు జరుగుతాయని.. బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తేదీల్లో ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు రక్షణ మంత్రిత్వశాఖ ది. సీవార్డ్ ఆర్టిలరీ ప్రాక్టీస్ యాక్ట్ 1949..ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం శిక్షణకు అనుమతి జారీ చేసిందని చెప్పారు. సూర్యలంక సముద్రతీర ప్రాంత నివాసితులు వైమానిక స్టేషన్‌వైపు వెళ్లవద్దని సూచించారు.

రాజధాని పనుల కోసం ఐదుగురు డిప్యూటీ కలెక్టర్లు

- జీవో జారీ చేసిన సీఎస్ విజయానంద్

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనుల నిమిత్తం ఐదుగురు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం ఆదేశాలు జారీ చేశారు. బి.గాయత్రీదేవి, కె. లలిత, ఎస్.విజయలక్ష్మి, కె.రాజగోపాలరావు, తిరువీధుల రాధికను పురపాలక శాఖ, పట్టణాభివృద్ధి విభాగంలోని ఏపీ సీఆర్డీఏకి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా నియమించారు.

పీజీ పరీక్షలో ప్రతిభ చాటిన మంగళగిరి విద్యార్థి

మంగళగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యలో మంగళగిరి సాయినగర్‌కు చెందిన పాపన జితేంద్ర రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను చాటారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం తాజాగా విడుదల చేసిన పోస్టు గ్రాడ్యుయేషన్ ఫలితాల్లో జితేంద్ర ప్రథమ స్థానంలో నిలిచారు. నగరానికి చెందిన జితేంద్ర ఆర్థోపెడిక్ విభాగంలో 800 మార్కులకు గాను 568 మార్కులను సాధించి.. రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచారు. జితేంద్ర ఏలూరు జిల్లా ఆశ్రమ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఆశ్రమ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చేబ్రోలు శ్రీనివాసరావు, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ఎం మల్లికార్జునరెడ్డి ప్రభృతులు జితేంద్రకు అభినందనలు తెలిపారు.


పాపన జితేంద్రఫైల్

అమరావతిలో పొట్టిశ్రీరాములు..

58 అడుగుల కాంస్య విగ్రహం

- ఆర్యవైశ్య సంఘం సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ రాకేష్


సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ రాకేష్

వినుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల చిరకాల ఆకాంక్షను కూటమి ప్రభుత్వం నెరవేర్చేలా అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహానికి సన్నాహలు చేస్తోందని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ డుండి రాకేష్ తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలోని వాసవి కల్యాణ మండపంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లాడారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని గుర్తించలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలో సుమారు 6.8 ఎకరాల విస్తీర్ణంలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేయడంతో పాటు 58 అడుగుల ఎత్తు గల ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిపాదించడం హర్షణీయమన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి విగ్రహాన్ని ప్రారంభించేందుకు ఆర్యవైశ్యులందరూ ముక్తకంఠంతో ఏకతాటిపై నడవాలని పిలుపునిచ్చారు. గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఆర్యవైశ్యులు కులదేవత వాసవి అమ్మవారి ఆత్మార్పణం చేసుకున్న పెనుగొండను వాసవి పెనుగొండగా మారుస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, పక్షం రోజుల్లో ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందన్నారు. ఈ సందర్భంగా స్మృతి వనం లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఆయన వెంట పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పెనుగొండ శ్రీనివాసరావు, అత్తులూరి సుబ్బారావు, మోటమర్రి నరసింహారావు, పువ్వాడ రామకృష్ణ ప్రసాద్, గట్టుపల్లి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, గజవల్లి నాగపవన్‌కుమార్, మండవ వెంకట కిరణ్‌కుమార్, రెడ్డి వెంకటరత్నం, సాయికుమార్, కాసుల వెంకట రవీంద్ర, గుడిపాటి శేష పద్మజ, పెండ్యాల సురేష్ బాబు, రెడ్డి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

260 మంది యువతకు ఉద్యోగవకాశాలు

మంగళగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారాలోకేశ్ చొరవతో వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగాజాబ్ మేళా విజయవంతమైంది. 260 మంది యువతకు ఉద్యోగవకాశాలను కల్పించినట్టు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి కె.సంజీవరావు తెలిపారు. మొత్తం 10 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 510 మంది అభ్యర్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంపికైన వారికి ఉద్యోగ నియామకపత్రాలను అప్పటికప్పుడే అందజేశారు. నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మడి సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కనీసం 20లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలను కల్పించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారని చెప్పారు. సీడాప్ జేడీయం రాంబాబు మాట్లాడుతూ తదుపరి జాబ్ మేళాకు ఉద్యోగవకాశాలను పొందవచ్చునని మిగిలిన అభ్యర్థులకు సూచించారు. మెప్మా పీడీ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు పల్లబోతుల శ్రీనివాసరావు, కేసనేని శ్రీఅనిత, తాళ్ల అశోక్‌కుమార్‌యాదవ్, వాసా పద్మ తదితరులు పాల్గొన్నారు.


యువతికి నియామక పత్రం అందజేత

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

రూ.265 లక్షల పనులకు నగర పంచాయతీ ఆమోదం

దాచేపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ సాధారణ సమావేశంలో రూ.265లక్షల అభివృద్ధి పనులకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. శనివారం సచివాలయం-1లో ఛైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ పలు సమస్యలపై సమావేశంలో ఏకరువు పెట్టారు. కాగా సమావేశంలో జరిగే చర్చ పట్ల సభ్యులు ఆసక్తి చూపకపోవటం విశేషం. సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేను వెంటనే పూర్తి చేయండి

● ఈవోఆర్‌డీ ప్రసాదు

మాచవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న స్వమిత్వ సర్వే కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలని ఈవోఆర్‌డీ ప్రసాదు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మాచవరం, మల్లవోలు, వేమవరం తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా సర్వేను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాపు భవన నిర్మాణ పనులు ప్రారంభం



దాచేపల్లిలో కాపు భవన నిర్మాణపనుల్లో భాగంగా బోరు వేయిస్తున్న కాపు నేతలు

దాచేపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో కాపు భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. సుమారు రూ 50 లక్షల నిధులతో నిర్మాణపనులు చేపట్టారు.

4న మండల పరిషత్ సమావేశం

పిడుగురాళ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం డిసెంబరు 4వ తేదీ జరుగనున్నదని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం.నాగచంద్రకుమారి తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ సమస్యలపై ధర్నా

పిడుగురాళ్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా డిసెంబరు 12న కలెక్టరేట్‌ల వద్ద జరిగే ధర్నాని విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు, సీఐటీయూ నేతలు కోరారు. పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీవో రాజేశ్వరికి అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి

సత్తెనపల్లి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి అన్నారు. అసిస్ట్, ఐటీసీ ఆధ్వర్యంలో మండలంలోని నందిగామలో గల సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, అంగన్ వాడీ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ, వీవోఏ, సీఆర్‌పీలకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అసిస్ట్ ప్రతినిధి అనీల్‌కుమార్ పీపీటీ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో రాజగోపాల్, డీఎన్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దరువూరి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కోమటినేని శోభారాణి, కోమటినేని శ్రీనివాసరావు, షేక్ మస్తాన్‌వలి, డిప్యూటీ ఎంపీడీవో సుధారాణి, పీఎస్ కుంభా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయ సిబ్బందికి సన్మానం

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా అమరేశ్వరాలయంలో విధులు నిర్వహించిన పారిశుధ్యసిబ్బందికి, గత పదేళ్లుగా కోటిదీపోత్సవంలో పాల్గొంటున్న అర్చకులకు బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ సన్మానం చేశారు. శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో పారిశుధ్య సిబ్బంది విశేషమైన సేవలందించారన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానాచార్యులు సుధీర్‌శర్మ, చందూ పాల్గొన్నారు.

పేద బాలికలకు దుస్తుల పంపిణీ

అచ్చంపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన, తల్లితండ్రి లేని పేదల విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసినట్టు అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు తెలిపారు. శనివారం కేజీబీవీలో ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటరావు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవటం వల్ల శారీరకంగా, మానసికంగా బలహీనులవుతారని తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మాణిక్యం, పద్మ పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటమే ప్రభుత్వ ఉద్దేశం

క్రోసూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటమే రైతన్నా మీ కోసం కార్యక్రమ ఉద్దేశమని టీడీపీ మండల రైతు అధ్యక్షుడు కంచేటి నరసింహారావు అన్నారు. శనివారం పీసపాడులో జరిగిన కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి సర్వే నిర్వహించారు. ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు చేయూత అందిస్తున్నట్టు తెలిపారు.

అనుమతి లేని ఇసుక లారీల నిలిపివేత

పెదకూరపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అనుమతిలేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను పోలీసులు నిలిపివేశారు. తుళ్ళూరు మండలం నుంచి ఇసుక లోడుతో పెదకూరపాడు మీదుగా సత్తెనపల్లి ఇసుకలోడుతో వెళ్తున్న ఏడు లారీలను మండలంలోని 75 తాళ్ళూరు-పరస గ్రామాల మధ్య నిలిపివేసినట్లు ఎస్ఐ జీ గిరిబాబు తెలిపారు. అనుమతి లేని ఇసుక లారీలను తహసీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకువెళ్ళగా తహసీల్దార్ నీలి ధనలక్ష్మి ఒక్కొక్క ఇసుక లారీ యజమానికి రూ 5వేల జరిమానాను విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

బెల్లంకొండలో వాహనాల తనిఖీ

బెల్లంకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో ఎస్ఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సూచించారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి అపరాధ రుసుం వసూలు చేశారు. తనిఖీల్లో సిబ్బంది షణ్ముక్, మల్లి, ఎల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందాం

● మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్, హాజరైన కౌన్సిలర్లు

మాచర్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా ఉండి మాచర్ల పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ ఛైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఛైర్మన్ మదార్‌సాహెబ్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంకాగానే ఛైర్మన్ కౌన్సిలర్లనుద్దేశించి మాట్లాడుతూ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కృషితో మాచర్లకి నిధుల వచ్చాయని, వాటితోపట్టణ సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. సంక్రాంతి పండుగ నాటికి టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేద్దామన్నారు. అజెండాలో పొందుపరిచిన 24 అంశాలు, టేబుల్ అజెండాలోని 28 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు యర్రాకుల సిద్ధమ్మ, కలివెల జ్యోతి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, ఏఈ రాఘవేంద్రరావు, విద్యుత్ శాఖ ఏడీఈ రామయ్య, హౌసింగ్ ఏఈ మరియదాసు, టౌన్ ప్లానింగ్ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తూకం సరిగా ఉండాలి

● డీఎస్‌వో ప్రసాద్

రాజుపాలెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎంఎల్‌ఎస్ పాయింట్ నుండి రేషన్ షాపులకు వెళ్లే నిత్యావసరాల తూకం ఖచ్చితంగా వుండాలని డీఎస్‌వో ఎంవీ ప్రసాద్ అన్నారు. శనివారం రాజుపాలెంలోని పౌరసరఫరాల శాఖ గోడౌన్‌ను తనిఖీ చేసి షాపులకు, అంగన్‌వాడీలకు వెళ్లే బస్తాల బరువును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సరుకులను జియోట్యాగ్ విధానం ద్వారా పరిశీలిస్తామని, ఎక్కడైనా లోపాలుంటే సంబంధిత అధికారులు, డీలర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. రాజుపాలెం తహసీల్దార్ సరోజ, డీటీ జానీబాష, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ



రాజుపాలెం సివిల్ సప్లయి గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్‌వో ఎంవీ ప్రసాద్, తదితరులు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న పౌర సరఫరాల శాఖ గోదామును డీఎస్‌వో శనివారం తనిఖీ చేశారు. గోదాములో ఉన్న బియ్యం, కంది పప్పు, జొన్నల నిల్వలను ఆయన పరిశీలించారు. కింద పడిన లూజు బియ్యాన్ని మరలా ఎత్తి గోతాల్లో పోయవద్దని ఇన్‌చార్జ్ నాగేశ్వరరావుకు సూచించారు. రేషన్ షాపులకు సకాలంలో సరుకులు చేరవేయాలన్నారు. అనంతరం స్టాక్, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. డిసెంబరు నుంచి రేషన్ షాపుల ద్వారా జొన్నలు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

నేడు అందుబాటులో విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయం

గురజాలటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు కార్యాలయంలో ఆదివారం కూడా చెల్లించవచ్చని ఏఈ ప్రసాద్ శనివారం తెలిపారు. విద్యుత్ బిల్లులు బకాయి ఉన్నవారు చెల్లించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

రక్తదానం బాధ్యతగా భావించాలి

● తహసీల్దార్ మేరీ కనకం

రెంటచింతల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆపదలో వున్నవారికి రక్తదానం చేయడం బాధ్యతగా భావించాలని తహసీల్దార్ మేరీ కనకం కోరారు. శనివారం రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరంలో 32 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి, కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ గోపి, టెక్నీషియన్లు, ఆర్ఐ మన్మోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సర్వేయర్ సులేమాన్‌ఖాన్‌కు సన్మానం

కారంపూడి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కారంపూడి మండల సర్వేయర్ సులేమాన్‌ఖాన్ జిల్లా సర్వేయర్ సంఘం సంయుక్త కార్యదర్శిగా ఎన్నికవడంతో శనివారం కారంపూడిలో అంజుమన్ కమిటి ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటి అధ్యక్షుడు షేక్ బడేసా, ఉపాధ్యక్షుడు షేక్ మోదీన్‌షా, సయ్యద్ అహ్మద్, షేక్ సైదా, సయ్యద్ సుబాని, బాషు, తండా అబ్బాస్, యాసిన్, బడేసా, షేక్ బడేసా, జాని తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ

కారంపూడి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం శ్రీవాసవీ సేవా అన్న ప్రసాద కమిటి ఆధ్వర్యాన అన్న ప్రసాదం పంపిణీ చేశారు. యక్కల వెంకటేశ్వర్లు దంపతులు, యక్కల చిన్న వెంకటేశ్వర్లు దంపతులు, యక్కల శ్రీనివాసరావు దంపతులు ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అన్న ప్రసాద కమిటి ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, దేవస్థాన అధ్యక్షుడు మద్దు హనుమంతురావు, జిల్లా ఆర్య వైశ్య సంఘం నేతలు చీతిరాల వెంకట కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మాచర్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను మాచర్ల రూరల్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ సంధ్యారాణి రూరల్ పోలీస్‌స్టేషన్లో వివరాలను వెల్లడించారు. మండలంలోని రాయవరం గ్రామంలో ఓ మహిళ అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. ఆమె నుంచి 12 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని సదరు మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి

● వ్యవసాయాధికారి కే దేవదాసు



కల్లాల్లో ధాన్యాన్ని పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న ఏవో కే దేవదాసు

నకరికల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా వరి కోతలు వారం రోజుల పాటు వాయిదా వేసుకోవాలని ఏవో కే దేవదాసు రైతులకు సూచించారు. శనివారం వరి పొలాలను ఆయన పరిశీలించి పొలాల్లో ధాన్యాన్ని వెంటనే ఇంటికి చేర్చుకోవాలన్నారు. ధాన్యం అమ్ముకున్న వెంటనే 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. వరికోతకు సిద్ధంగా ఉన్నవాటిని కంబైన్డ్ హార్వెస్టర్‌తో నూర్పిడి చేయించుకొని ధాన్యాన్ని భద్రపరుచుకోవాలన్నారు. రెండు మూడు రోజుల్లో కోయాల్సిన వరికోతలు వాయిదా వేసుకోవాలన్నారు. రైతులు ఆర్‌ఎస్‌కేల్లో తమ పేర్లను నమోదు చేసుకొని అమ్ముకోవచ్చన్నారు. గ్రేడు ఏ ధాన్యం 75 కిలోల బస్తా ధర రూ.1792గా తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కే దిలీప్ కుమార్, ఏఏ వై ప్రభాకర్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహనా ర్యాలీ



అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఏరియా వైద్యశాల వద్ద జరిగిన ర్యాలీ

సత్తెనపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశానుసారం హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాల వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ర్యాలీలో డాక్టర్ ఆర్‌ఎంఈవో కృష్ణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్ నర్సు వెంకటేశ్వరమ్మ, డాక్టర్ భాగ్యమ్మ, ఐసీటీసీ సెంటర్ కౌన్సిలర్ పేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం



సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో ఉద్యోగులను సన్మానిస్తున్న డీఎం విజయకుమార్ తదితరులు

సత్తెనపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో నవంబరులో అత్యధిక కేఎన్‌పీఎల్ సాధించిన డ్రైవర్లు ఎస్‌కేఎండీ సలాం, కేకే రావులను, అత్యధికంగా ఈపీకే సాధించిన కండక్టర్లు కేపీ ప్రసాదు, కోటిరెడ్డిలను డిపో మేనేజర్ విజయకుమార్ శనివారం బస్టాండ్‌లో ఘనంగా సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి డ్రైవర్లు, కండక్టర్లు వీరిని ఆదర్శంగా తీసుకొని డిపో అభివృద్ధికి పాటుపడాలన్నారు.

ఉపాధ్యాయుల మండల స్థాయి ఆటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో ఎండీ ఖాసీం

వెల్దుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి జడ్పీ హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఈవో ఎండీ ఖాసీం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.

క్రోసూరులో..

క్రోసూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రోసూరు జడ్పీ హైస్కూల్‌లో శనివారం మండల స్థాయి ఉపాధ్యాయుల ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన టీంలను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్టు ఎంఈవో కృష్ణ తెలిపారు. హెచ్‌ఎం బాబూరావు, ఎంఈవో- 2 ఎం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించినట్టు ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, డీ నగేష్‌లు శనివారం తెలిపారు. విజేతలకు డిసెంబరు 13న డివిజన్ స్థాయిలో పోటీలు జరుగుతాయని తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సంఘానికి మైక్ సిస్టం అందజేత

మాచర్ల రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఆటల పోటీలు సందర్భంగా శనివారం పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘానికి రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల తరుపున రూ.20వేల విలువైన మైక్ సిస్టంను సీనియర్ రొటేరియన్ ఇక్కుర్తి శంకర్ ద్వారా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు జాన్, సెక్రటరీ అనిల్‌కుమార్‌లకు అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కోటేశ్వరరావు, అల్లి సురేష్, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, కొండవీటి రామకోటయ్య, పఠాన్ నాగూర్‌వలి, రమణ, రామకృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



క్రోసూరు: నియోజక వర్గ స్థాయి పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు

18 ఏళ్ళు నిండిన ప్రతి విద్యార్థి లెర్నింగ్ లైసెన్సు పొందాలి

● ఎంవీఐ డి.శేషిరెడ్డి

రెంటచింతల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ళు నిండిన ప్రతి విద్యార్థి లెర్నింగ్ లైసెన్స్ పొందాలని మాచర్ల ఎంవీఐ జి.శేషిరెడ్డి సూచించారు. శనివారం రెంటచింతలలోని ఫాతిమా విద్యానికేతన్‌లో విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. స్కూల్ బస్సులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్టెఫీ, కరస్పాండెంట్ ఏరువ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



పట్టణ పార్టీ కార్యాలయంలో సమావేశమైన టీడీపీ నేతలు

పిడుగురాళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుండి టీడీ పీ బలోపేతమయ్యేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మండల పార్టీ కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు తెలిపారు. పరిశీలకులు పూజల వెంకటకోటయ్యతో కోనంకి, పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి కార్యకర్తలతో మాట్లాడిన అనంతరం పట్టణ పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం కరాలపాడు గ్రామంలో పరిశీలకులు సాతులూరి కుమార్, పార్టీ నేతలు పర్యటించారు. గత ఎన్నికలలో మెజారిటీ తగ్గిన బూత్‌లకు సంబంధించి అక్కడి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై రాబోయే ఎన్నికల నాటికి పార్టీ బలోపేతంపై చర్చించారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షులు యడ్లపల్లి శివ, నందిపాటి శ్రీనివాసరెడ్డి, అనబోతుల యలమందారెడ్డి, పాదర్తి రాజేశ్వరి, సంకుల వెంకటేశ్వర్లు, సాంబయ్య, జాని, తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించరాదు

● తహసీల్దార్ కే పుల్లారావు



చల్లగుండ్ల ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కే పుల్లారావు

నకరికల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు పౌరహక్కులకు భంగం కలిగించరాదని తహసీల్దార్ కే పుల్లారావు కోరారు. శనివారం పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా చల్లగుండ్ల ఎస్సీ కాలనీలో సమావేశం నిర్వహించారు. వ్యక్తుల మధ్య తారతమ్యాలు చూపకూడదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రసాదు, ఆర్ఐ తోట సిద్దయ్య, బొక్కా చినగురు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో పౌరహక్కుల దినోత్సవం

రాజుపాలెం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడు గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సీ కాలనీలో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ జానీబాష, ఆర్ఐ గోపి, ఏఎస్ఐ కిరణ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ అధికారి పాపయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలలో పక్షపాతం, కక్షసాధింపు వుండవని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎవరికైనా పొలం, స్థలం, ఏమైనా ఇబ్బందులు, అన్యాయం జరుగుతున్నట్లైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అఖిల భారత మహాసభను జయప్రదం చేయండి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్



విలేకరులతో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

విజయపురిసౌత్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4వ తేదీన వరకు నిర్వహించనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ కోరారు. శనివారం మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెట్టుబడిదారుల దోపిడీకి అడ్డంగా ఉన్న 29 కార్మిక చట్టాలనుమార్పు చేసి 4 లేబర్ కోడ్‌లు తెచ్చారని, దీనివల్ల పెన్షన్‌తోపాటు అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్‌లు అమలుకావడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్ల మహేష్, జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయక్, వేముల వెంకట్రావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇవ్వకపోవటం అన్యాయం

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రవిబాబు

క్రోసూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, తుఫాన్ వల్ల నష్టపోయిన జిల్లా రైతాంగానికి పరిహారం ఇవ్వకపోవటం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ రవిబాబు అన్నారు. శనివారం జరిగిన సీపీఎం క్రోసూరు కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో పంట నష్ట పరిహారం ఇవ్వాల్సిన అవసరం లేదని అధికారులు తేల్చటం దారుణమన్నారు. పత్తికి మద్దతు ధర ఇస్తున్నామని ప్రచారం చేస్తూ ప్రభుత్వం రైతులను వంచిస్తోందన్నారు. నియోజకవర్గంలోని రైతులు రెవెన్యూ, రీసర్వే సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించాలని కోరారు. క్రోసూరు కమిటీ కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, రావెల వెంకటేశ్వర్లు, ముత్యాల పౌలు, గంజిమాల ఎలిశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..

● ఒకరి పరిస్థితి విషమం

గురజాలటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఒకరి పరిస్థితి విషమం కాగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. శనివారం రాత్రి గురజాల పట్టణ శివారులో ఈ ప్రమాదం జరిగింది. మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మాచర్ల - నడికుడి హైవే నుంచి గురజాల పట్టణంలోని క్రాస్ మలుపు వద్దకు రాగా మాచర్ల వైపు వెళ్తున్న లారీ, బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో గురజాల పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బండారు చిరంజీవి తలకు తీవ్ర గాయమైంది. 108లో చిరంజీవిని పట్టణ ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. పట్టణ సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వినోద్‌కుమార్‌లు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ధూళిపాళ్ళ గృహానికి మంత్రి అచ్చెన్నాయుడు

పొన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గృహానికి శనివారం రాష్ట్రమంత్రి కింజారపు అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ చిన్న కుమార్తె ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి నిశ్చితార్థ వేడుక ఆదివారం జరగనున్న నేపథ్యంలో మంత్రి శనివారం విచ్చేసి వైదీప్తికి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ధూళిపాళ్ళ కుటుంబ సభ్యులు కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వైదీప్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి

కూటమి హయాంలో నెంబర్ వన్‌గా ఏపీ

● సినీ నటుడు నరేష్ ● పేటలో విజయనిర్మల విగ్రహం ఏర్పాటు



శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, సినీ నటుడు నరేష్

నరసరావుపేట కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాబోయే రోజుల్లో నెంబర్ వన్ అవుతుందని సినీ నటుడు నరేష్ అన్నారు. పట్టణంలో నరేష్ తల్లి, ప్రముఖ నటి, దర్శకురాలు విజయనిర్మల విగ్రహ ప్రతిష్ఠాపనకు స్థలం ఎంపిక చేయడానికి వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్న కంపెనీలన్నీ ఏర్పాటైతే యువత ఉద్యోగాల కోసం ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. దేశంలోనే చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడన్నారు. తన తల్లి విజయనిర్మల నరసరావుపేటలో పుట్టారని, ఆమె మేనమామ పసుపులేటి వసంతరావు థియేటర్ ఇంజనీర్‌గా పనిచేశారని తెలిపారు. చిన్నప్పుడు తన తల్లితో తాను నర్సరావుపేటకు వచ్చి జమీందార్ కోటలో ఆడుకునే వాడినని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు ఇక్కడ తిరిగినప్పుడు ఉద్వేగానికి లోనయ్యానని చెప్పారు. నరసరావుపేటతో అనుబంధం ఉన్నందునే ఇక్కడ తన తల్లి విజయనిర్మల విగ్రహం ప్రతిష్ఠాపించాలని సంకల్పించానని చెప్పారు. స్థలం పరిశీలన నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో పట్టణంలో తిరిగానన్నారు. ఈ విషయంలో ఆయన సహకారం మరువలేనన్నారు. అలాగే తాను న్యూ మోంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్‌కు నేషనల్ ప్రెసిడెంట్‌నని, త్వరలో పట్టణంలో ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా కుంగ్‌ఫూ అకాడమి ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కేవలం కుంగ్‌ఫూ పరిమితం కాకుండా యోగా, కూచిపూడి, భరతనాట్యం వంటివి కూడా నేర్పించేలా శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుచేస్తానన్నారు. ప్రస్తుతం తాను ఏ పార్టీలో లేనని తెలిపారు. సినిమాల్లో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను బాగా ఎంజాయ్ చేస్తున్నానన్నారు. ప్రస్తుతం 8 కొత్త చిత్రాలలో నటిస్తున్నట్లు చెప్పారు. తన చిత్రం భళారే చిత్రం, జంబలకిడిపంబను రీమేక్ చేయాలని ఉందన్నారు. నాలుగుస్తంభాలాట సినిమాను రీ రిలీజ్ చేస్తానన్నారు.

యువత మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టి పెట్టాలి

యువత ఆత్మరక్షణ కోసం కుంగ్‌ఫూ వంటి మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టి పెట్టాలని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం స్థానిక హెచ్6 రెసిడెన్సీలో జరిగిన న్యూ మోంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ సర్టిఫికెట్ ప్రదాన కార్యక్రమానిక ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, మార్షల్ ఆర్ట్స్‌లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను, సిని నటుడు నరేష్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కుంగ్‌ఫూను యువతకు చేరువ చేయడంలో న్యూ మోంక్స్ అసోసియేషన్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అనంతరం నరేష్‌తో కలిసి శిక్షణ పొందిన వారికి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, షేక్‌జిలానిమాలిక్, కామినేని సాయిబాబు, గట్టినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్, అనకాపల్లి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో గుంటూరు మీదగా సికింద్రాబాద్, అనకాపల్లి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07041 సికింద్రాబాద్ - అనకాపల్లి ప్రత్యేక రైలు డిసెంబరు 7, 14, 21, 28(ఆదివారం) తేదీలలో పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది. 07042 అనకాపల్లి - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు డిసెంబరు 8, 15, 22, 29(సోమవారం) తేదీలలో గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా గమ్యస్థానానికి చేరుకొంటుంది. 02863 సంత్రగచి - యల్హాంక ప్రత్యేక రైలు డిసెంబరు 4, 11, 18, 25(గురువారం) తేదీల్లో గుంటూరు, నరసరావుపేట మీదగా ప్రయాణిస్తుంది. 02864 యల్హాంక - సంత్రగచి స్పెషల్ డిసెంబరు 6, 13, 20, 27(శనివారం) తేదీల్లో నరసరావుపేట, గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది.

డాక్టర్ నరేంద్రరెడ్డికి టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు

గుంటూరు మెడికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ప్రఖ్యాత టైమ్స్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ చేతుల మీదుగా డాక్టర్ నరేంద్రరెడ్డి అవార్డును స్వీకరించారు. ప్రముఖ మీడియా సంస్థ టైమ్స్ యాజమాన్యం ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఈ అవార్డు ప్రదానం చేస్తోంది. వైద్య రంగానికి సంబంధించి తుంటి, మోకీలు మార్పిడి ఆపరేషన్లలో రోబోటిక్ టెక్నాలజీ వినియగం ద్వారా విశేష ప్రతిభ కనబర్చి.. లీడర్ ఇన్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీగా డాక్టర్ నరేంద్రరెడ్డి నిలిచారని టైమ్స్ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో రోబోటిక్ ద్వారా అత్యధిక శస్త్రచికిత్సలు నిర్వహించడంతో దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ప్రఖ్యాత టైమ్స్ అవార్డును అందుకున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డికి పలువురు వైద్యులు, పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు.



అనుపమ్ ఖేర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

వీవీఐపీల ప్రయాణ మార్గంలో ప్రత్యేక భద్రతా తనిఖీలు



సీడ్ యాక్సిస్ రోడ్డులో తనిఖీలు



తనిఖీల్లో భద్రతా విభాగం, ఎస్ఎస్‌జి సిబ్బంది

తాడేపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వీవీఐపీలు, వీఐపీలు తరచూ ప్రయాణించే ముఖ్య మార్గాల్లో భద్రతా ప్రమాణాలు మరింత బలోపేతం చేసేందుకు జిల్లా భద్రతా విభాగం (డీఎస్‌డబ్ల్యూ), స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ (ఎస్ఎస్‌జీ) సంయుక్తంగా శనివారం విస్తృతం తనిఖీలు చేపట్టాయి. ప్రకాశం బ్యారేజి లోటస్ పాయింట్, కరకట్ట, సీడ్ యాక్సిస్ రోడ్డు, సెక్రటరియట్, లోటస్ పాయింట్ నుంచి టీడీపీ కేంద్ర కార్యాలయం వరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ మార్గాల్లోని క్రిటికల్ పాయింట్లు, ట్రాఫిక్ జంక్షన్లు, రోడ్డు పక్క వ్యాపార సముదాయాలు, డివైడర్లు, చెట్ల పొదలు, కల్వర్టులు, వంతెనలు, తూములు వంటి ప్రతి విభాగాన్ని ప్రత్యేక పరికరాలు, ఆధునిక భద్రతా యంత్రాలు, శిక్షణ పొందిన పోలీసు జాగిలాల సాయంతో ముమ్మరంగా జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు మాట్లాడుతూ.. ఎటువంటి భద్రతా లోపాలు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను పటిష్టం చేయడానికి.. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ భద్రతా సిబ్బంది నిర్వహించే భద్రత తనిఖీల ఖచ్చితత్వాన్ని సమీక్షించడానికి భద్రతా ప్రమాణాల మెరుగుదల అవసరమైన ప్రాంతాలను గుర్తించడానికి ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌జీ డీఎస్పీ రామకృష్ణ, జిల్లా భద్రతా విభాగ ఆర్ఐ శ్రీనివాసరావు, ఎస్ఎస్‌జీ ఆర్ఐలు నరేష్, శంకర్, డీఎస్‌డబ్ల్యూ ఎస్ఎస్‌జీ సిబ్బంది పాల్గొన్నారు.

దిత్వా వస్తోంది.. పంటలు జాగ్రత్తా!

పంటల రక్షణకు డాక్టర్ పీవీ సత్యనారాయణ సూచనలు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

నైరుతి బంగాళాఖాతం అనుకుని ఉన్న శ్రీలంక తీరంలో దిత్వా తుపాను ఉత్తర - వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. తీవ్ర వాయుగుండంగా తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని అంటోంది. దీని ప్రభావంతో దక్షిణకోస్తా, రాయలసీమ ప్రాంతంలో అక్కడక్కడ భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతిభారీ వర్షాల కురుస్తాయన్న నేపథ్యంలో సాగులో ఉన్న పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ కీలక సూచనలు చేశారు.



వరి పంట

వరి: దక్షిణ మండలంలో పిలకల దశలో, కృష్ణా మండలంలో కోత దశలో, కుప్పలు, పనల మీద వరి పంట ఉంది. ఆలస్యంగా వేసిన పంట పూత నుంచి పాలు పోసుకునే దశలో ఉంది. ఈదురు గాలులకు పంట నష్టం తీవ్రతను తగ్గించేందుకు.. ఈ సూచనలు పాటించాలి.

● నారుమడిలోని 2-3 రోజుల వయసులో ఉన్న పంట 3 రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే.. మొలక శాతం గణనీయంగా తగ్గుతుంది. విత్తిన ఏడు నుంచి 30 రోజుల మధ్యంలో నారు ఐదు రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బ తినే అవకాశం ఉంది. నారు మడిలో ఐదు రోజుల లోపు నీరు పూర్తిగా బయటకు తీసి.. 5 సెంట్ల నారు మడికి కేజీ యూరియా, కేజీ పోటాష్ వేసుకోవాలి. గ్రాము కార్బెన్డిజిమ్ లేదా రెండు గ్రాముల కార్బెన్డిజిమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.



డాక్టర్ పీవీ సత్యనారాయణ

● పిలకల దశలో సాధారణ రకాలు ఐదు రోజులు నీట మునిగిన బతికే అవకాశం ఉంది. నీరు బయటకు పంపిన తర్వాత ఎకరాకు 20 కేజీల యూరియా, 20 కేజీల పోటాష్ కలిపి అదనంగా వేసుకోవాలి.

● వరి పంట పూత నుంచి పాలుపోసుకునే దశలో ఉంటే.. అంతర్గత కాలువల ద్వారా నీటిని తొలగించాలి. పంట పడిపోయిన పొలంలో గింజలు రంగు మారడం, మాగుడు, మానిపండు తెగుళ్ల నివారణకు ఎకరాకు 200మి.లీ. ప్రొపికోనాజోల్ పిచికారీ చేయాలి.

● గింజ గట్టిపడే దశ నుంచి కోత దశలో ఉంటే.. నిల్వ నీటిని బయటకు పంపిన తర్వాత.. కోత కంకిలో మొలకలు కనపడితే 50 గ్రాములు కల్లు ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఇది మొలకెత్తడాన్ని, రంగు మారడాన్ని తగ్గిస్తుంది.

● ఇప్పటికే కోతకోసి కుప్పల మీద ఉన్న ధాన్యాన్ని బరకాలు కప్పుకొని రక్షించుకోవాలి. గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా క్వింటాలు ధాన్యానికి కేజీ ఉప్పు, 20 కేజీ పొడి ఊక కలపాలి.

మినుము, పెసర: మినుము, పెసర పంటలు మొలక దశ నుంచి శాఖీయ, పూత నుంచి కాయ కోత దశలో ఉంది. మొలక దశ నుంచి శాఖీయ దశ అపరాలు పంటలు ముంపునకు గురైతే.. పొలాలలో మురుగు వీలైనంత త్వరగా తొలగించాలి. ఇనుపధాతు లోపం నివారణకు అన్న బేది 50 గ్రాములు, నిమ్మ ఉప్పు 5 గ్రాము, యూరియ 100 నుంచి 150 గ్రాముల లెక్కన 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. వారం తరువాత ఒక శాతం 19: 19: 19 లేదా పొటాసియం నైట్రేట్‌ను కలిపి పిచికారి చయాలి. వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్లు రాకుండా లీటరు నీటికి 2.0 మి.లీ. హెక్సాకొనజోల్ లేదా ఒక మి.లీ ప్రొపికొనజోల్‌ను కలిపి పిచికారి చేయాలి.

● పూత నుంచి కాయ దశలో ఉన్న పంటలో వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్లు రాకుండా లీటరు నీటికి 2.0 మి.లీ హెక్సాకొనజోల్ లేదా ఒక మి.లీ ప్రొపికొనజోల్‌ను కలిపి పిచికారి చేయాలి. మారుక మచ్చల పురుగు ఆశించకుండా.. క్లోరిపైరిఫాస్ 20 ఈసీ 2.5 మి.లీ లేక నోవాల్యురాన్ 10 ఈసీ 1.0 మి.లీలో ఏదో ఒక మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

శనగ: శనగ పంట ప్రస్తుతం మొలకెత్తే దశ నుంచి శాఖీయ దశలో ఉంది. మొదలుకుళ్లు, తడి వేరు కుళ్ళు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. నివారణకు తెగులు సోకిన మొక్కల వేరు భాగం తడిచేలాగా లీటరు నీటికి 3 గ్రామాలు మాంకోజెబ్ లేదా కార్బెండజిం 12శాతం, మాంకోజెబ్ 63 శాతం చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు నివారణకు కార్బెండజిం గ్రాము లీటర్ నీటిలో కలుపుకొని వేరు భాగం తడిచేలాగా పిచికారి చేయాలి. నీరు నిలిచిన పొలాల్లో మొక్కల ఆకులు పసుపు రంగలోకి మారితే.. 10గ్రాముల యూరియా లేదా 10 గ్రామాలు 19-19-19 చొప్పున లీటరు నీటికి కలుపుకుని పైపాటుగా పిచికారి చేయాలి. దీనితో పాటుగా కార్బెండజిం 12శాతం, మాంకోజెబ్ 63శాతం చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకుంటే తెగుళ్ల వ్యాప్తిని కూడా అరికట్టవచ్చు.

పత్తి: పగిలిన పత్తిని వెంటనే తీసి జాగ్రత్త చేసుకోవాలి. సాధ్యమైనంత త్వరగా ప్రత్తి తీతలు పూర్తి చేయాలి. మురుగు నీటిని వీలైనంత త్వరగా పోయే మార్గం కల్పించాలి. పంటలో చాళ్లు ఏర్పాటు చేసి మొక్కలలో గాలి, కాంతి ప్రసరణను పెంచాలి. వర్షాలు తగ్గిన తర్వాత పొడి వాతావరణంలో పత్తి తాయాలి. తీసిన పత్తిలో తేమ ఎక్కువగా ఉంటే.. నీడలో ఆరబెట్టడం మంచిది. 5 గ్రాముల బోరాక్స్ లీటరు నీటికి 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. కాయ కుళ్లు తగ్గించడానికి 3 గ్రాములు కాపర్ ఆక్సీ క్లోరైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ లీటరు నీటికి కలిపి మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా మూడు మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా ప్రొపికోనజోల్ గాని క్రెసోక్సిమ్ మిథైల్ గాని మీ.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4.5% నాఫ్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి.

జొన్న, మొక్కజొన్న: జొన్న, మొక్కజొన్న కాండాన్ని బలపరచేందుకు ఎర్తింగ్ అప్ చేయాలి. సాధ్యమైనపుడు చిన్న కాలంలో పండే జోన్నను ముందుగానే కోయాలి. కోత సమీపిస్తున్న మొక్కజొన్నలో గింజల్లో 20-25% తేమ ఉన్నపుడు ముందుగా కోయాలి. పడి పోయే ప్రమాదం ఉన్న పొలాల్లో మొక్కలను కట్టివేయడం/ టై చేయడం చేయాలి. తుపాను ముందు మూడు నాలుగు రోజులు నీటిపారుదల ఇవ్వకూడదు. డ్రెయినేజీ అడ్డంకులు రాకుండా పొలంలోని అవశేషాలను తొలగించాలి. వర్షాలు పడే ముందు ప్రొటెక్టివ్ ఫంగిసైడ్ (ప్రొపికోనజోల్/ కార్బెండాజిమ్) పిచికారీ చేయాలి. ప్రస్తుతం నైట్రోజన్ టాప్ డ్రెస్సింగ్ ఇవ్వకూడదు. వర్షాల తర్వాత కండె కుళ్లు నివారణ కోసం ఫంగిసైడ్ పిచికారీ చేయాలి. బలమైన గాలులు వీయకముందే కోతకు సిద్ధమైన మొక్కజొన్నను వెంటనే కోయాలి. కండెలను ఎత్తైన ప్రదేశాల్లో ఆరబెట్టాలి. జొన్న పడిపోవడం తగ్గించేందుకు కంకులను కట్టివేయాలి. మొక్కజొన్న, జొన్న శాఖీయ దశలో ఉంటే.. తుపాను ముందుగా ఎలాంటి ఎరువులు వేయకూడదు. వర్షం అంచనా స్పష్టంగా వచ్చే వరకు కొత్తగా మొక్కజొన్న విత్తకూడదు. వర్షం తర్వాత 3-5 రోజుల్లో గ్యాప్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి.

విభిన్న క్రీడల్లో ప్రతిభావంతులు

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఉత్సాహంగా క్రీడా పోటీలు..



పరుగు పందెం ప్రారంభిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు



షాట్‌పుట్‌లో.. బెస్ట్ అవుట్‌పుట్



త్రిచక్ర వాహనాలపై దూసుకెళ్తూ..

గుంటూరు (క్రీడలు) నవంబరు 29(ఆంధ్రజ్యోతి) దివ్యాం గులు విభిన్న అంశాలలో ప్రతిభ కలిగి ఉంటారని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి ఆకాంక్షించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల శాఖ గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో దివ్యాంగులకు శనివారం క్రీడా పోటీలను నిర్వహించింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ దివ్యాంగుల్లో ప్రతిభకు కొదవలేదని.. సృజనాత్మకతను మరింతగా వెలికి తీసి పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను దివ్యాంగులకు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యా, ఉపాధి అవకాశాల్లోను, క్రీడారంగంలోను రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి, ఇన్‌చార్జి దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకుల డి.దుర్గా బాయి మాట్లాడుతూ డిసెంబరు 3న దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలను వివిధ అంశాల్లో నిర్వహించినట్లు తెలిపారు. క్రీడా పోటీలు, దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొనే దివ్యాంగ ఉద్యోగులకు ఆన్ డ్యూటీగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాలను దివ్యాంగులు అందిపుచ్చుకునే విధంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ టి.విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ నజీమా, విభిన్న ప్రతిభావంతుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులు జెండా ఊపి లాంఛనంగా క్రీడా పోటీలను ప్రారంభింపజేశారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే ఏపీఐడీసీ ధ్యేయం

● ఛైర్మన్ డేగల ప్రభాకర్



బోర్డు సమావేశంలో పాల్గొన్న ఛైర్మన్ డేగల ప్రభాకర్, డైరెక్టర్లు

తాడేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడడమే ఏపీఐడీసీ ధ్యేయమని బోర్డు ఛైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. శనివారం తాడేపల్లిలోని ఏపీఐడీసీ కార్యాలయంలో ఛైర్మన్ అధ్యక్షతన కార్పొరేషన్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ స్థితిగతులు, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుంచి 792 కంపెనీలకు సుమారు రూ.344 కోట్ల లోన్లు అందించడం జరిగిందన్నారు. 2006 నుంచి కొన్ని అనివార్య కారణాల వల్ల కార్పొరేషన్ యాక్టివిటీ ఆగిపోవడం జరిగిందని, ముఖ్యంగా కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఐడీసీని పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎంతగానో ప్రోత్సహించారన్నారు. వారి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పలు అంతర్జాతీయ జాతీయ సంస్థలతో రూ.16లక్షల కోట్లతో కీలక ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందన్నారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక కేంద్రంగా మారిందన్నారు. విశాఖ వేదికగా కుదిరిన పారిశ్రామిక ఒప్పందాలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును సువర్ణమయంగా మారుస్తాయన్నారు. ఏపీ ఐడీసీని గాడిలో పెట్టేందుకు సంవత్సరకాలం పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల అకౌంట్ల పనులను పూర్తిస్థాయిలోకి తీసుకువచ్చామన్నారు. రెండు నెలల్లో పూర్తి స్థాయిలో ప్రభుత్వ నిర్ణయం మేరకు అభివృద్ధిలో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. రుణాలు తీసుకున్న వివిధ కంపెనీలకు నోటీసులు ఇచ్చి రికవరీలు కూడా చేస్తున్నట్టు పేర్కొన్నారు. పీ 4 విధానంతో పరిశ్రమలకు ఇండస్ట్రియల్ పార్కులకు పెద్ద పీట వేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయానికి అనుగుణంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండి రఘునాథ్, డైరెక్టర్లు మల్హోత్రా, బాలభారతి, రాజారావు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తుల మృతి

నరసరావుపేట లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో రెండు వేర్వేరు చోట్ల ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. నరసరావుపేట- మునుమాక రైల్వేస్టేషన్ల మధ్య శనివారం రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతి చెందినట్లు నరసరావుపేట రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి మెడపై మూడు నక్షత్రాలు పచ్చబొట్లు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసినవారు నరసరావుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పావులూరి సుబ్బారావు పాఠశాల ఎదురుగా సుమారు 30 నుంచి 30 సంవత్సరాలకు వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆచూకీ తెలిసినవారు మొదటి పట్టణ పోలీసులను సంప్రదించాల్సిందిగా ఎస్ఐ అరుణ కోరారు.

అంబటి డబ్బులు వసూలు చేస్తే.. మా మీద నిందలా?

● మాజీ మంత్రిపై వైసీసీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ విమర్శ
● డస్ట్‌బిన్ నిధుల గోల్‌మాల్‌పై కౌన్సిల్‌లో సమాధానం



సమావేశంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసీ

సత్తెనపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పురపాలక సంఘంలో డస్ట్ బిన్‌ల కొనుగోలుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి అంబటి రాంబాబు డబ్బులు వసూలు చేస్తే.. తమ మీద నిందలు వేస్తే ఎలా? అంటూ వైసీపీకి చెందిన మునిసిపల్ ఛైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసీ శనివారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పురపాలక సంఘంలో డస్ట్ బిన్‌ల కొనుగోలుకు గత ప్రభుత్వంలో రూ.54లక్షలు నిధులు వస్తే దుర్వినియోగం చేసి.. పట్టణంలో రెండు కోట్ల రూపాయలకు పైగా విరాళాలు వసూలు చేశారని మునిసిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్ ఆరోపించారు. దీంతో 'మునిసిపాలిటీ పేరు చెప్పి అంబటి రాంబాబు డబ్బులు వసూలు చేస్తే.. మా మీద నిందలు వేస్తే ఎలా? అంబటి రాంబాబును అగగండి.' అంటూ అంటూ ఛైర్‌పరన్ లక్ష్మీతులసీ తీవ్రంగా స్పందించారు. ఆమె సమాదానం విన్న వైసీపీ కౌన్సిలర్లు ఖంగుతిన్నారు. వైసీపీ మాజీ మంత్రిపై ఆ పార్టీకి చెందిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆరోపణలు చేయడం అటు కౌన్సిల్‌లో, ఇటు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

రైతుల సొమ్ము స్వాహాపై చర్యలు

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జీడీసీసీ బ్యాంకు మంగళగిరి బ్రాంచ్ పరిధిలోని మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఏకంగా మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న మంగళగిరి నియోజకవర్గంలో పరిధిలోని పీఏసీఎస్‌లలో అక్రమాలు జరగటం సహకార శాఖ వర్గాల్లో కలకలం రేకెత్తిస్తోంది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో మంగళగిరి, కురగల్లు పీఏసీఎస్‌లలో రైతుల సొమ్ము స్వాహా పేరుతో ప్రచురితమైన కథనం ఆ శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దాంతో వెంటనే స్పందించిన అధికార యంత్రాంగం ప్రాథమిక విచారణ జరిపి అక్రమాలు నిజమేనని తేల్చి చెప్పారు. మంగళగిరి, కురగల్లులో రైతులు దాచుకున్న సొమ్మును ఇంటి దొంగలే కాజేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అక్రమాలు వెలుగుచూడటంతో గగ్గోలు పెట్టిన రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రాథమిక నివేదిక ఆధారంగా కమిషనర్ అనుమతితో కలెక్టర్ విచారణకు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా సహకార అధికారి వీరాచారి తెలిపారు. మంగళగిరి, కురగల్లు సంఘాలకు సీఈవోగా వ్యవహరిస్తోన్న రాయల రమేష్‌బాబుపై ఇప్పటికే మంగళగిరి రూరల్, టౌన్ పోలీస్‌స్టేషన్‌లలో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా మంగళగిరి, కురగల్లు పీఏసీఎస్‌లలో ఇంటి దొంగలే రైతుల సొమ్ము స్వాహా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా అక్రమాలపై నెల రోజుల్లో విచారణ పూర్తి చేసి, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వారంలో రెండుసార్లు ఇన్‌చార్జి అదనపు జిల్లా జడ్జి బెంచ్

నరసరావుపేట లీగల్, నవంబరు 29, (ఆంధ్రజ్యోతి): డిసెంబరు ఒకటో తేదీ నుంచి ప్రతి సోమ, శుక్రవారాలలో 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి నరసరావుపేటలో బెంచ్ నిర్వహించనున్నట్లు నర్సరావుపేట న్యాయవాద సంఘ అధ్యక్షుడు జీవీ సుబ్బారావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు న్యాయవాద సంఘ కార్యాలయానికి సమాచారం వచ్చినట్లు ఆయన తెలిపారు.

రద్దీ ప్రాంతాల్లో నిఘా పెంపు: ఎస్‌ఐ వేణుగోపాల్

ఈపూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రజల భద్రత కోసం నిఘా పెంచుతున్నామని, అందుకోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌ఐ కె.వేణుగోపాల్ తెలిపారు. ఈపూర్ బస్టాండ్ సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రతి గ్రామ రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సృజనాత్మకతోనే స్టార్టప్‌లకు విజయం

● ఎస్‌ఆర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గురునాథం



అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గురునాథం గోలిని జ్ఞాపికతో సత్కరిస్తున్న చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవంతమైన స్టార్టప్‌లను నిర్మించడానికి సృజనాత్మక ఆలోచన అవసరమని ఎస్‌ఆర్ యూనివర్సిటీ ఆస్త్రా స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ అండ్ అసోసియేట్ ప్రొఫెసర్ గురునాధం గోలీ అన్నారు. శనివారం ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ యాజ్ ఎ కెరీర్ అవకాశం అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అసోసియేట్ ప్రొఫెసర్ గురునాధం గోలి మాట్లాడుతూ, రిస్క్ తీసుకునే సామర్థ్యం, నిరంతర అభ్యాసం అవసరాన్ని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, డైరెక్టర్ డి.శ్రావ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ ప్రభాకర్ రావు

నరసరావుపేట లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సీహెచ్ ప్రభాకర్ రావు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రవర్తన మార్చుకొని మంచి పౌరులుగా మెలగాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పిడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు లేఖ ప్రియాంక, సౌందర్ రాజన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ విద్యాలయంగా కే-రిడ్జి పాఠశాల



స్వచ్ఛ విద్యాలయం పురస్కారంతో ప్రిన్సిపాల్ బర్నబాస్, చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కే-రిడ్జి ఇంటర్నేషనల్ పాఠశాలకు ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మకమైన స్వచ్ఛ విద్యాలయంగా 5 స్టార్ రేటింగ్ లభించిందని ప్రిన్సిపాల్ జి.బర్నబాస్ శనివారం తెలిపారు. పరిశుభ్రత హరిత, వాతావరణం, ప్లాస్టిక్ రహిత క్యాంపస్, సురక్షిత పారిశుధ్య వసతులు, పర్యావరణ రహిత కార్యక్రమాల అమలులో విశిష్టంగా నిలిచినందుకు ఈ గుర్తింపు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసికట్టుగా చేసిన కృషికి ప్రతిఫలం ఈ అవార్డు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కోమటినేని నాసరయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

వినుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు గాండ్ల నాగేంద్రుడు ఆర్థిక సాయంతో మైకు సెట్‌ను శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు యేరువ వెంకట నారాయణ మాట్లాడుతూ, రోటరీ విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తోందని, రానున్న రోజుల్లో రోటరీ క్లబ్ సాయంతో మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు యశోద, రోటరీ జోనల్ చైర్మన్ (ఎన్విరాన్‌మెంట్) ఆలా శ్రీనివాసరావు, రోటరీ డైరెక్టర్, ఆంగ్ల అధ్యాపకుడు కరీముల్లా, క్లబ్ అడ్మినిస్టేటర్ కూచి రామాంజనేయులు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని తరలించొద్దు

రొంపిచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లకు మంజూరైన కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని వేరే చోటుకు తరలించొద్దని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, రొంపిచర్లకు కేంద్రీయ విశ్వవిద్యాలయం మంజూరైనా ప్రభుత్వాల అలసత్వం వల్ల కేంద్రీయ నిర్మాణ పనులు జరగలేదన్నారు. అనంతరం తహసీల్దార్ బండి నిర్మాలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాదుగున్నల శ్రీనివాస రావు, గోదా జాన్‌పాల్, బూదాల బాబూరావు, కాసా రాంబాబు, చక్రవరం సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

10 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత

చిలకలూరిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రూరల్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు శనివారం అప్పగించారు. సెల్ ఫోన్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరాలకు గురికాకుండా చూసుకోవాలని ఎస్‌ఐ జి.అనిల్ కుమార్ సూచించారు.

ఐదేళ్లలో కానిది ఏడాదిలో సరి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళలో రోడ్లపై ఏర్పడిన చిన్న గుంత కూడా పూడ్చనివారు, రైతులను పట్టించుకోని వారు నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం పని చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల్లో శనివారం జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన, రైతన్నా మీ కోసం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా లింగారావుపాలెం గ్రామంలో పర్యటించి రూ.2.42 కోట్ల నాబార్డు నిధులతో ఏర్పాటు చేయనున్న బోయపాలెం-లింగారావుపాలెం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కొండవీడు కోటను జాతీయరహదారికి అనుసంధానించేందుకు చర్యలు తీసుకుం టామని చెప్పారు.


రూ.2.40కోట్ల నాబార్డు నిధులతో నిర్మించనున్న బోయపాలెం-లింగారావుపాలెం బీటీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

● రేపటి నుంచి నిబంధనలు సరళతరం

సీసీఐ పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతులు తెలిపిన సమస్యల్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, డిసెంబరు 1 నుంచి నిబంధనలు సరళతరం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కరిముల్లా, టీడీపీ మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, తెలుగురైతు జిల్లా అధ్యక్షులు వీరారెడ్డి, మండల తెలుగురైతు అధ్యక్షులు లక్ష్మీప్రసాదు, టీడీపీ నాయకులు సదాశివరావు, శ్రీనివాస రెడ్డి, పోపూరి వెంకయ్య, రాఘవయ్య, కట్టా శ్రీహరి, నంబూరు కృష్ణారావు, తోకల రాజేష్, మురుకుట్ల బుజ్జి, తోకల సాంబశివరావు, ఎంపీటీసీ వీరరాఘవయ్య, ఎంపీడీవో హేమలతాదేవి, ఏవో హరిప్రసాద్, ఏఈ శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రైల్వే లైన్ సాకారానికి కృషి

చిలకలూరిపేట: చిలకలూరిపేట మీదుగా వెళ్లే శావల్యాపురం-బాపట్ల రైల్వే లైన్ సాకారానికి తన వంతు కృషి చేస్తానని ప్రత్తిపాటి అన్నారు. శావల్యాపురం-బాపట్ల రైల్వే లైన్ సాధన సమితి సభ్యులు ప్రత్తిపాటిని కలిశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ, ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రమైన కోటప్పకొండకు భక్తుల రాక మరింత పెరగడానికి ఈ రైల్వే లైను దోహదం చేస్తుం దన్నారు. ప్రత్తిపాటిని కలిసిన వారిలో రైల్వే లైన్ సాధనా సమితి అధ్యక్షుడు గోగినేని నాగేశ్వరరావు, సమితి బాధ్యులు గుడిపల్లి నాగభూషణం, పోలూ రి శ్యామ్ మోహన్ రావు, తోట బ్రహ్మస్వాములు, వెల్లంపల్లి రాము ఉన్నారు.

● మేరీశౌరిల సేవలు అభినందనీయం

యడ్లపాడు: పదవీ విరమణ తరువాత కూడా పాఠశాల అభివృద్ధి గురించి ఆలోచించే ఉపాధ్యాయులు అరుదుగా ఉంటారని, అలాంటి కొద్ది మందిలో ఉపాధ్యాయురాలు మేడిపల్లి మేరీశౌరీల ఉండడం గర్వించాల్సిన విషయం అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు మేరీ శౌరీలు పదవీ విరమణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం కేవీ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. అతిథులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు మేరిశౌరిల దంపతులను ఘ నంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, టీడీపీ నాయకులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఉపాధ్యాయుల ఆటల పోటీలు

శావల్యాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లోని ఉపాధ్యాయులకు మానసికోల్లాసాన్ని నింపేందుకు ప్రభుత్వం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు మద్దిగుంట్ల సాంబశివరావు, పసులూరి లలితాకుమారి తెలిపారు. మండలస్థాయిలో వేల్పూరు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన పురుషుల క్రికెట్ పోటీలను ఎంఈవో సాంబశివరావు, శావల్యాపురం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన మహిళల త్రోబాల్ పోటీలను ఎంఈవో లలితాకుమారీ శనివారం ప్రారంభించారు. పురుషుల క్రికెట్ పోటీల్లో మతుకుమల్లి జట్టు, మహిళల త్రోబాల్ పోటీల్లో శావల్యాపురం జట్టు విజయం సాధించాయి. గెలుపొందిన రెండు జట్లు డిసెంబరు 13,14వ తేదీల్లో వినుకొండలో జరగనున్న డివిజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఎంఈవో తెలిపారు. గెలుపొందిన జట్లను హెచ్ఎంలు విజయలక్ష్మి, మహబూబ్ సుభానీ, ఉపాధ్యాయులు అభినందించారు.


త్రోబాల్‌లో గెలుపొందిన శావల్యాపురం క్లస్టర్ టీం

రెడ్డిపాలెంలో..

రొంపిచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలను ఎంఈవో బ్రహ్మేశ్వరరావు ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ రవి నాయక్ కెప్టెన్‌గా ఓ జట్టు, జడ్పీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు కెప్టెన్‌గా రెండో జట్టును ఏర్పాటు చేసి తలపడ్డారు. పోటీలో ప్రతిభ కనబరిచిన టీమ్‌ను డివిజన్ స్థాయికి ఎంపిక చేస్తామని ఎంఈవో తెలిపారు.

వెల్లటూరు జిల్లా పరిషత్ పాఠశాలలో...

బొల్లాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను శనివారం మండల విద్యా శాఖ అధికారులు కె.పార్వతి, జీ చిన్నపరెడ్డి ప్రారం భించారు. క్రికెట్‌లో రావులాపురం జట్టు, త్రో బాల్‌లో వెల్లటూరు జట్లు విజేతలుగా నిలిచాయి.

నూజెండ్లలో..

నూజెండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో జరిగిన క్రికెట్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పోటాపోటీగా ఆడారు. మహిళా ఉపాధ్యాయినులు త్రోబాల్, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ఎంఈవోలు కె.సత్యానారాయణ, ఎన్.రవిచంద్ర ప్రారంభించారు.

దింతెనపాడుకు ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

యడ్లపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దింతెనపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించారు. శనివారం చిలకలూరిపేట నుంచి తిమ్మాపురం మీదుగా తిమ్మాపురంకు ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు గ్రామస్థులు బస్సు సమస్యను ఎమ్మెల్యే ప్రత్తిపాటి దృష్టికి తీసుకురాగా ఆయన చిలకలూరిపేట ఆర్టీసీ డిపో అధికారులతో మాట్లాడి గ్రామానికి బస్సులు నడపాలని ఆదేశించారు. ప్రారంభ కార్యక్రమంలో డిపో మేనేజరు రాంబాబు, ఆర్టీసీ ఉద్యోగులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

వినుకొండటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన శనివారం మున్సిపల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు వినుకొండ పట్టణంలోని ప్రధాన సమస్యలపై సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మార్కాపురం రోడ్డులోని డ్రెయినేజీల్లో పూడికలు తొలగించి అధికారులు పట్టించుకోలేదని, వినుకొండ తహసీల్దార్ కార్యాలయంలో వర్షం వస్తే వర్షపునీరు నిల్వ ఉండటం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా అధికారులను నిలదీశారు. పట్టణంలోని ప్రధానరోడ్లపై ఉన్న డివైడర్లలోని చెట్లను తొలగించారని ఆ స్థానంలో మళ్లీ చెట్లు ఎప్పటికి ఏర్పాటు చేస్తారని మున్సిపల్ వైస్‌చైర్మన్ రాజేష్‌కన్నా ప్రశ్నించారు. ఎస్సీ వార్డుల్లో అభివృద్ధి కుంటుపడిందని, నిధులు కేటాయించి ఆ ప్రాంత అభివృద్ధికి చొరవ చూపాలని మరో వైస్‌చైర్మన్ గాబ్రియేలు సభ దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ గంటా కాలేషా విద్యుత్ శాఖాధికారులను నిలదీశారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ దస్తగిరి

శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీలు

శావల్యాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు ఆధ్వర్యంలో శావల్యాపురం పోలీస్ స్టేషన్‌లో శనివారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారికి గ్రామాలపై ఉన్న అవగాహన, ప్రజలకందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినుకొండ రూరల్‌సీఐ బ్రహ్మయ్యతో కలసి మొక్కలు నాటారు. శావల్యాపురం సెంటర్లో ఇటీవల అమర్చిన సీసీకెమేరాలు, తరచూ రోడ్డుప్రమాదాలు జరుగుతున్న పొట్లూరు సమీపంలోని ఆర్‌యూబీప్రాంతాన్ని, కనమర్లపూడి సమీపంలోని కోల్డ్‌స్టోరేజీప్రాంతాన్ని పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దినందుకు ఎస్‌ఐ లోకేశ్వరరావు, ఏఎస్‌ఐ బాజీ, రైటర్ బాషలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.


పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న డీఎస్పీ హనుమంతరావు

రైతులకు 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు

● ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

నూజెండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో నగదును వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని తలార్లపల్లి గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం పాల్గొని రైతులు, వ్యవసాయ అధికారులు, నాయకులతో కలసి పంట పొలాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, ఎన్డీఏ ప్రభుత్వం రైతు సంక్షేమానికి రాయితీలు అందించి ప్రోత్సహిస్తుందన్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు వ్యవసాయ అనుబంధ శాఖలకు పెద్ద మొత్తంలో రాయితీలు ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీ కృష్ణ యాదవ్, సొసైటీ చైర్‌పర్సన్‌లు ముంద్రు సుబ్బారావు, బచ్చు అంజిరెడ్డి, డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ లగడపాటి వెంకటరావు, ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు కుంటా కోటిరెడ్డి, మాదాల యలమంద, అనుమోలు మల్లారెడ్డి, ఏడీఏ రవి కుమార్, ఏవో ఆంజనేయులు నాయక్, హెచ్‌వో రసూల్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి

● ఎంపీడీవోకు పొట్లూరు గ్రామస్థుల ఫిర్యాదు

శావల్యాపురం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సర్పంచ్ పోపూరి జ్యోతి గ్రామ పాలనను నిర్లక్ష్యం చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పొట్లూరు గ్రామస్థులు ఎంపీడీవో మీన సీతారామయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీవోను శనివారం కార్యాలయంలో కలసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. ఫిర్యాదు అందజేసిన వారిలో తెలుగుయువత మండల అధ్యక్షుడు గోనుగుంట్ల ధనుంజయ్, టీడీపీ పొట్లూరు అధ్యక్షుడు గడిపూడి ప్రసాద్, నీటిసంఘం అధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు పొందూరి సుబ్బయ్య, వార్డు సభ్యులు పొందూరి శ్రీనివాసరావు ఉన్నారు.

రొంపిచర్లలో కోటి సంతకాల సేకరణ

రొంపిచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైసీపీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ మీద క్యాబినెట్‌లో ఆమోద ముద్ర వేసుకొని జీవో జారీ చేసిందన్నారు.

తురుమెళ్ళలో రైతన్నా మీ కోసం కార్యక్రమం

రొంపిచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురుమెళ్ళ గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు. రాబోయే పంట కాలంలో రైతులకు మద్దతు ధర కల్పించే విధంగా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నాదెండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్లలోని శ్రీ సాయి ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అల్లూరి హెల్త్ కేర్ సర్వీసెస్ ఎండీ సుధాకర్ బాబు తెలిపారు. పాఠశాల వారి సహకారంతో శ్రీ సాయి సత్య హస్పటల్, మార్కెటింగ్ టీమ్ అల్లూరి హెల్త్ కేర్ సర్వీసెస్ వారు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

● తిరుమల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ

నరసరావుపేట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటుగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తిరుమల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో టీ ఎస్ టీఈ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైవీ నారాయణ మాట్లాడుతూ, తిరుమల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వివిధ రకాల పోటీలలో పాల్గొని మంచి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులను పోటీ ప్రపంచంలోనికి తీసుకెళ్లడానికి తమ కళాశాల ముందుంటుందన్నారు. యాక్టివిటీస్, పోస్టర్ ప్రెజెంటేషన్, భావ వ్యక్తీకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాగ్దేవిలో ఆర్థిక అభివృద్ధి సదస్సు

నరసరావుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఆర్థిక అభివృద్ధిపై శనివారం సదస్సు నిర్వహించారని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాదు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంఘం 46వ ప్రీ ఆన్యువల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా భారత ఆర్థిక సంస్థ సంచాలకులు ఆచార్య టీఎల్ఎన్ స్వామి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, స్థానిక వనరులను ఉపయోగించుకొని యువత నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు పెంపొందించ్చుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కొండపల్లి పరమేశ్వరరావు, ఆర్థిక సంఘ కార్యదర్శి ఆచార్య ఎం కోటేశ్వరరావు, బి.మస్తాన్, కళాశాల చైర్మన్ కాట్ల రామకోటేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి కృష్ణకిషోర్, డాక్టర్ కరిముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్యం సురక్షితం: శిఖా మీల్ బరాలా

చిలకలూరిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో కాంగ్రెస్ పాలన వస్తేనే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందని, ప్రజల హక్కులు పరిరక్షింప బడతాయని పల్నాడు జిల్లా సంస్థాగత ఎన్నికల పర్యవేక్షకురాలు, ఏఐసీసీ పరిశీలకురాలు ఎమ్మెల్యే శిఖా మీల్ బరాలా అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సంఘటన్ శ్రీ జన్ అభియాన్ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శిఖా మీల్ బరాలా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలోపేతమైనప్పుడే దేశానికి మంచి రోజులు వస్తాయని అన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శులు కుర్షిదా బేగం, తోట శివ నాగేశ్వరరావులతో కలిసి పల్నాడు జిల్లా అంతా పర్యటిస్తున్నామని చెప్పారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు యం ప్రసన్న, మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హాజీ షేక్ సలాం, ప్రధాన కార్యదర్శి షేక్ నస్రుద్దీన్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ కరీమూన్ పాల్గొన్నారు.

కళాశాల ఆటస్థలంలో క్లీన్ అండ్ గ్రీన్

వినుకొండటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల రోడ్డులోని గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న ఆటస్థలంలో విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. గ్రౌండ్‌లో చెట్లు అమాంతం పెరిగి అడవిని తలపిస్తుంది. దీంతో ఆకతాయిలు గ్రౌండ్‌లోకి చొరబడి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా స్థలాన్ని శుభ్రం చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తుఫాన్ దృష్ట్యా కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చిలకలూరిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా పట్టణంలో నీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటం, చెట్లు కూలడం వంటి సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ 08647-253994కు తెలియజేవచ్చని కమిషనర్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

చిలకలూరిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలోని ప్రకృతి ఆధారిత వ్యవసాయ క్షేత్రాన్ని గణపవరం జడ్పీ హైస్కూలు పదో తరగతి విద్యార్థులు శనివారం సందర్శించారు. రసాయన ఎరువులు వాడకుండా పూర్తిగా సేంద్రియ విధానంలో సాగుచేస్తున్న పండ్ల తోట, కూరగాయలను, ఎద్దు గానుగల ద్వారా నూనెను తీసే విధానం, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి పట్టణానికి చెందిన కందుల రవికుమార్ విద్యార్థులకు ఈ సందర్భంగా వివరించారు.

వెదురు సాగు మార్కెటింగ్‌పై అవగాహన

చిలకలూరిపేట/నాదెండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నాదెండ్లలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వెదురు సాగు మార్కెటింగ్, విలువ వృద్ధిపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రోగ్రెసివ్ ఫార్మర్ వెంకటేశ్వరరావు వెదురు సాగులో తన అనుభవాలను వివరించారు. సాగుకు అనుకూలమైన నేల, నీటి అవసరత, రాబడి విషయాలను తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ.వెంకటరావు, స్థానిక అధికారి శ్రీలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు హరిబాబు, మండల తెలుగు రైతు అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో శ్రీరామ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

శావల్యాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో శనివారం నిర్వహించిన బాలోత్సవం పోటీల్లో శావల్యాపురం శ్రీరామ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్ తెలిపారు. స్థిరమైన ప్రపంచానికి గ్రీన్ టెక్నాలజీ అనే అంశంపై జరిగిన పోస్టర్ ప్రజంటేషన్‌లో పాఠశాల విద్యార్థిని స్వప్న ప్రథమ బహుమతిని, అనిల్ కుమార్ కన్సోలేషన్ బహుమతిని పొందారన్నారు. రైతాంగ సమస్యపై ప్రదర్శించిన నాటికలో పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో తృతీయ బహుమతిని పొందారన్నారు. బాలోత్సవం ప్రతినిధులు విజేతలను అభినందించి ప్రశంసాపత్రాలను, మెమొంటోలను అందజేశారని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ మోహన్‌చంద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టర్ అజిత్‌చంద్, ఉపాధ్యాయులు అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బాలోత్సవం ప్రతినిధులు